## 'నన్నయ'లో చైల్డ్ సైకాలజీ కోర్సు

ప్రజాశక్తి-రాజానగరం

నన్నయ యూనివర్సిటీ డిపార్టమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభిస్తున్నామని విసి ఆచార్య జివిఆర్.ప్రసాద రాజు తెలిపారు. యూనివర్సిటీలో ఈ బ్రోచర్లను విసి ఆవిష్కరించి వివరాలను తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్టమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ డిప్లొమా కోర్సును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఏడాది కాలపరిమితితో 40 సీట్లతో అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిర్వహణలో పీజీ డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 2వ తేదీ నుండి 17వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# అంగన్‌వాడీలకు అలవెన్స్‌లేవీ..

- నాలుగేళ్లుగా బిల్లులు పెండింగ్
- ఆందోళనలో వర్కర్లు
- సమావేశాలకూ సొంత ఖర్చులతో హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీ కార్యకర్తల టిఎ, డిఎ బిల్లులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక టిఎ, డిఎలు ఇవ్వకుండా వేధిస్తోంది. అంతంతమాత్రంగా వచ్చే జీతంలో నుంచే వీరు ప్రతినెలా రూ.వెయ్యి వరకు సమావేశాలకు రానుపోను ఖర్చు పెట్టుకుంటున్నారు. ఇలా.. నాలుగేళ్ల వ్యవధిలో ఒక్కో కార్యకర్తకు రూ.25 వేల వరకు ప్రభుత్వం బకాయి పడింది. వీటిని ఎప్పుడు ఇస్తుందో తెలియదు. పోనీ గట్టిగా నిలదీద్దామనుకుంటే.. తమ పోస్టుకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలో పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 1000 మంది జనాభాకు ఒక మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, 150 మంది జనాభాకు మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో తనిఖీల పేరుతో వేధింపులకు గురి చేస్తున్న విషయం విదితమే. అయితే నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతోంది.

**జిల్లాలో 7 ప్రాజెక్టులు**

జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాల చొప్పున 1562 ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కరు, హెల్పరుతో కలిపి మొత్తం 3072 మంది.. మినీ అంగన్ వాడీ కేంద్రాల్లో 26 మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఆరు నెలల పసిబిడ్డ నుంచి మూడేళ్ల పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తారు. దీనికిగాను ప్రతి నెలా ప్రాజెక్టు, పీడీ కార్యాలయాల్లో సమావేశాలు. రేషన్‌బియ్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ తుంటారు. ఈ సమావేశాలకు హాజరయ్యే వర్కర్లకు భోజనానికి, రవాణా ఖర్చుల కోసం ప్రభుత్వం నగదు ఇస్తుంది. గతంలో టిఎ, డిఎలు కలిపి ఒక్కో వర్కర్‌కు రూ.450 నుంచి రూ.600 వరకు ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లింపులు నిలిచిపోయాయి

**ఒక్కొక్కరికీ సుమారు రూ.25 వేల బకాయి**

అంగన్‌వాడీ వర్కర్లకు నెలలో రెండు సమావేశాలుంటే రూ.550, మూడు సమావేశాలుంటే రూ.600 వరకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో దాదాపు నెలలో మూడు సమావేశాలకు తక్కువ లేకుండా జరిగాయి. ఈ లెక్కన ఒక్కొక్కరికి ఏడాదికి రూ.6200 చొప్పున నాలుగేళ్లకు కలిపి రూ.24,800 రావాలని ఒక అంచనా. ఈలెక్కన సుమారు రూ.7.61 కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. అదే విధంగా రవాణా ఖర్చులకు సొంత నిధులు వెచ్చించాల్సి వస్తోందని ఆంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టాకు పాయింటు నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి బియ్యం, పౌష్టికాహారాన్ని తెచ్చుకోవడానికి అయ్యే రవాణా ఖర్చులను కూడా సంవత్సరాల తరబడి ఇవ్వడం లేదు. ఇటీవల కాలంలో ఎండియు ఆపరేటర్లకు ఆ బాధ్యతలు అప్పచెప్పి చేతులు దులుపుకున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ వర్కర్లకు రావాల్సిన టిఏ, డిఏలను ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న టిఎ, డిఎ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి. ప్రభుత్వం అంగన్‌వాడీలకు నెలకు రూ.11,000, హెల్పర్‌లకు రూ.7000 మాత్రమే చెల్లిస్తోంది. మరో వైపు సంక్షేమ పథకాలను వర్తింపచేయడం లేదు. ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడితో అనేక మంది అంగనవాడీలు సమస్యలతో సతమతమవుతున్నారు.

**కెఎం.బేబిరాణి, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.**

### ప్రభుత్వానికి బిల్లులు పంపాము

అంగన్‌వాడీల టిఎ, డిఎ బిల్లుల బకాయిల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపించాము. ప్రభుత్వం నగదు విడుదల చేస్తే అంగన్‌వాడీలకు అందజేస్తాము. గత కొన్ని సంవత్సరాలుగా మీటింగ్‌ల సంఖ్య తగ్గించాము. కావున పెద్ద మొత్తంలో బకాయిలు ఉండవు.

**- కె.విజయకుమారి, ఐసిడిఎస్ పీడీ**

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రానున్న వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉంటాయనే హెచ్చరికల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి, తదితర ఉన్నతాధికారులు ప్రణాళికా రంగంలో సుస్థిర అభివద్ధి లక్ష్యాలు, వైద్య ఆరోగ్యం, మహిళా స్త్రీ సంక్షేమం, పాఠశాల విద్య, స్పందన, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, జగనన్న తోడు, గడప గడపకు మనం ప్రభుత్వం తదితర అంశాలపై అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిపై కలెక్టర్ మాధవీలత వివరాలు తెలియజేశారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్రింద మార్చి మాసంలో ఇప్పటి వరకు 4949 సాధారణ ఒపిలు చూశారని చెప్పారు. వేసవి తీవ్రతను దష్టిలో ఉంచుకొని ఐఎంఒ ఆదేశాల మేరకు సన్‌స్ట్రోక్ నిర్వహణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన మందులను సిద్ధంగా అందుబాటులో ఉంచామన్నారు. వృద్ధులు, నవజాత శిశువులు, గర్భిణుల ముందస్తు జాగ్రత్త కోసం పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. 6వ విడత జగనన్న తోడు కింద పట్టణ పరిధిలో 4,369, గ్రామీణ ప్రాంతాల్లో 19,078 మంది లబ్ధిదారుల లక్ష్యం దిశగా కార్యాచరణ అమలు చేయడం జరుగుతున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఒ కె.ప్రకాశరావు, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, వి.శాంతమణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ డి.బాల శంకర్‌రావు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దయామణి

## సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి

ప్రజాశక్తి-నిడదవోలు

అన్నింటా సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలని ఎపి స్టాఫ్ నర్సస్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.దయామణి అన్నారు. శుక్రవారం అంగన్‌ఆవడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యనంతరం నిరక్షరాస్యత, నిరుద్యోగం, సామాజిక వివక్ష, అత్యాచారాలు, దిగజారుతున్న విలువలు మహిళల అభివద్ధికి ఆటంకంగా ఉన్నాయన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులు సౌకర్యాలు పాలక వర్గాలు రద్దు చేస్తున్నాయన్నారు. పోరాటంతో హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి. డాక్టర్ హేమలత, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, హవీల, విజయలక్ష్మి, భూలక్ష్మి, మాధవి, జరీనా లక్ష్మీపార్వతి, రాజేశ్వరి, లక్ష్మి, కనకదుర్గ, సత్యవేణి, కోట దేవి, రూత్ పద్మా జ్యోతి పాల్గొన్నారు.

### పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కెజెకె.మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.పార్వతి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి వినతిపత్రాలు ఇచ్చారు. 2018 నుంచి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న డిఆర్ ఎరియర్లను వెంటనే చెల్లించాలని, పెన్షన్ చెల్లింపులో జాప్యం జరుగుతోందని, ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 11వ పిఆర్‌సి ఎరియర్లు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు పే ఫిక్సేషన్ స్టేట్మెంట్ ఇవ్వాలని కోరారు. ఈ ఏడాది జూలై ఒకటి నుంచి నూతన వేతన సవరణ అమలు చేయాల్సి ఉన్నందున తక్షణం 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు.

## గోనె సంచుల సమస్య నివారణపై దృష్టి

ప్రజాశక్తి-కోరుకొండ

వచ్చే సీజన్ నుంచి గోనె సంచులు సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ క్రొవ్విడి సత్రాజు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్ల ఛైర్మన్ క్రొవ్విడి సత్రాజు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌బికె ఛైర్మన్లు, గ్రామ వ్యవసాయ సహాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఇకపై నాణ్యమైన గోనె సంచులు మిల్లర్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా ఆర్‌బికెల పరిధిలో సాగు విస్తీర్ణాన్ని బట్టి ముందుగానే దిగుబడిని అంచనా వేసి దాన్ని బట్టి ముందుగా అధికారులకు తెలియజేయాలన్నారు. ఎడి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇకెవైసి కాపీని రైతుకు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.జిందాల్ పాపారావు, ఎఒ గౌరీదేవి పాల్గొన్నారు.

సమావేశంలో రైతు ఆందోళన

విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీరంకక పంట ఎండుపోతోందని, తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ కోటికేశవరం గ్రామానికి చెందిన కౌలు రైతు పీతా వెంకట్రావు పురుగుమందు డబ్బా చేతపట్టుకుని రావడంతో సమావేశంలో కలకలం రేగింది. సమస్యను విద్యుత్ అధికారులు, ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఛైర్మన్ సత్రాజు సముదాయించారు.

నంద్యాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

### నంద్యాలలో టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-నల్లజర్ల

కర్నూలు జిల్లా నంద్యాలలో టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని గెలిపించాలని గోపాలపురం నియోజక వర్గానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాసాహెబ్ ప్రచారం చేశారు. కర్నూలు జిల్లా నంద్యాలలో శుక్రవారం ఓటర్ల వద్దకు వెళ్లిన టిడిపి నాయకులు మొదటి ప్రాధాన్యతా ఓటును రామగోపాల్ రెడ్డికి వేసి మెజారిటీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. వీరి వెంట ఎవి.సుబ్బారెడ్డి, కన్వీనర్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

### సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దేశంలో తొలి ఉపాధ్యాయిని, స్త్రీల విద్యాభివద్ధికి విశేష కషి చేసిన సావిత్రీబాయి పూలే వర్థంతి సందర్భంగా ఆమెకు శుక్రవారం ఘనంగా నివాళుర్పించారు. ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి మాట్లాడుతూ సావిత్రిబాయి గొప్ప సంఘ సంస్కర్త, రచయిత్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ఎన్.కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### డి వార్మింగ్ డేకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, గోపాలపురం

ఈ నెల 14న నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహణపై శుక్రవారం ఎంఇఒ ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుండి 19 ఏళ్ల వయసుగల పిల్లలకు నులిపురుగు మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడారు. గోపాలపురంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అవగాహన సదస్సు నిర్వహించారు. టిఎ.సత్యప్రసాద్, బాషా, ఆర్.నీలవేణి, త్రిమూర్తులు, సిహెచ్‌ఒ ఎస్.రూతమ్మ, ఐసిడిఎస్ అధికారి యువి.పద్మ పాల్గొన్నారు.

### దగ్ధమవుతున్న అటవీ సంపద

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని సూది కొండ అటవీ ప్రాంతంలో అటవీ సంపద తరచుగా అగ్నికి ఆహుతి అవుతోంది. శుక్రవారం ఉదయం సూది కొండ చెక్ పోస్ట్ దాటిన తర్వాత ఎవరో ఆకతాయిలు కాల్చి విసిరేసిన సిగరెట్లు, చుట్టల వల్ల ఈ ప్రాంతంలో ఉన్న అడవిలో కొంత భాగం అగ్నికి ఆహుతి అయ్యింది. దగ్గరలో ఉన్న సూది కొండ అటవీ ప్రాంతం నుంచి ఒక అటవీ శాఖ ఉద్యోగి మినీ అగ్నిమాపక పరికరాన్ని తీసుకువచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.

### యూనియన్ బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వశిష్ట వినియోదారుల సంఘం అధ్యక్షులు సలాది ఉదయ భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా బ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో విలీనం అయినప్పటి నుంచి ఇప్పటివరకు బ్యాంక్ ఖాతాదారుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఖాతాదారులకు రోజుకు రూ.20 వేలకు మించి ఇవ్వకపోవడంతో రైతులు కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

## ముంపు సమస్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వచ్చే వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా నగర పాలక సంస్థ అధికారులు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నెహ్రూ నగర్ స్కూల్ సెంటర్ వద్ద 'గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం' కార్యక్రమం వార్డు ఇన్చార్జి బళ్ల సత్యవతీ శ్రీనివాస్, బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తమ వీధులన్నీ ముంపునకు గురవుతున్నాయని, ఆ ముంపు సమస్య నుండి కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. దీంతో మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటరీ, మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులను వెంట బెట్టుకుని ప్రధాన డ్రెయినేజీని పరిశీలించారు. కాలువలో పూడిక తొలగించాలని ఎంహెచ్‌ఒ వినూత్నకు ఎంపీ భరత్ సూచించారు.

ప్రజల సమస్యలు వింటున్న ఎంపీ భరత్

## పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో పాటు చేసిన అభివృద్ధి, అవినీతి రహిత పాలనను విస్తతంగా తీసుకెళ్లాలని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. సీతానగరంలో శుక్రవారం సమావేశంలో ఎంఎల్ఎ రాజా మాట్లాడారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్రమంతటా 175 నియోజక వర్గాల్లో గృహసారథుల కార్యాచరణ ఒకేసారి మొదలవుతుందని, ఆ కార్యక్రమానికి కన్వీనర్లు, గృహసారథులు సిద్ధంగా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వాలంటీర్లపై అపారమైన విశ్వాసం ఉంచామని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలబెట్టామన్నారు. జగనన్న ప్రభుత్వంపై అందరూ పూర్తి సంతప్తితో ఉన్నారని రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండల కన్వీనర్ గంట శ్రీను, కో కన్వీనర్ కరటూరి హరిబాబు, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకటకష్ణ చౌదరి, వైస్ ఎంపిపి ముదునూరి సురేష్ రాజు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొండ్రు ముత్యాలు, కవల కృష్ణమూర్తి, చల్లమళ్ల సుజీరాజు, సత్తిపండు రాజు, మద్దాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థల తాకట్టు

**కొవ్వూరు రూరల్ :** దేశంలో ప్రభుత్వ సంస్థలను ప్రజాధనాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లూథరన్ మార్టిన్ అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని ఎల్‌ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అరిగెల అరుణకుమారి మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంధం బాబ్జి, ఆకుల భాగ్యలక్ష్మి, నాదెళ్ల మురళీధరన్ పాల్గొన్నారు

## పాఠశాలకు బెంచీల అందజేత

ప్రజాశక్తి-కడియం

మండలంలో రెండు ఉన్నత పాఠశాలకు ఆంధ్ర పేపర్ మిల్లు 150 బెంచీలను అందజేసింది. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు విజ్ఞప్తి మేరకు వీటిని అందజేశారు. కడియం హైస్కూల్ ప్రాంగణంలో గిరజాల బాబు నేతత్వంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణకు వీటిని అందించారు. ఈ సందర్భంగా గిరజాల బాబు ఎపి పేపర్ మిల్ యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, గ్రామ పెద్దలు కుసునూరి బాబులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు, కడియం గణేష్, ఉపాధ్యాయుడు గండి స్వామి ప్రసాదు, తదితరులు ఉన్నారు.

## 'పేదల కడుపు కొట్టిన వైసిపి'

ప్రజాశక్తి-గోపాలపురం

టిడిపి పేదలకు పట్టెడన్నం పెడితే వైసిపి పేదల కడుపు కొట్టిందని టిడిపి గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట రాజు అన్నారు. శుక్రవారం అన్న క్యాంటీన్ వద్ద సుమారు 300 మందికి పైగా ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ గోపాలపురంలో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మద్దిపాటి రాజేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కాకర్ల తులసి, జగదీశ్ ఆర్థిక సౌజన్యంతో అన్నా క్యాంటీన్లలో ఉచిత భోజన కార్యక్రమాలు నిర్వహించారు.

### 15 నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-గోపాలపురం

ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్1వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ టి.ఉమాదేవి, కొండవీటి డిగ్రీ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ అరుణోదయ కుమార్ తెలిపారు. ఆశ్రమం పాఠశాలలో 393 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతారని, కొండవీటి డిగ్రీ కళాశాలకు 309 విద్యార్థులు పరీక్షలు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలన్నారు.

### సర్వేతో శాశ్వత భూ హక్కు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతులు ఎదుర్కుంటున్న భూసమస్యలను పరిష్కరించడంతో పాటు శాశ్వత భూహక్కు కల్పిస్తు పట్టాలు అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూసర్వే చేయిస్తోందని సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి అన్నారు. చిలకపాడులో శుక్రవారం భూముల రిజర్వు కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా మండల సర్వేయర్ నాగరాజు మాట్లాడుతూ సమగ్ర భూముల సర్వేతో రైతుల ఏళ్ల కాలం నాటి సమస్యలు పరిష్కరమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు తిరుమళ్ల నాగపార్వతి, పోశేశ్వరరావు, కార్యదర్శి రఘు నందనరావు, విఆర్‌ఒ చిట్టిబాబు పాల్గొన్నారు.

### ఫిజియోథెరపీ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం జిఎస్ఎల్ మెడికల్ కళాశాల్లో ఏడో జాతీయ ఫిజియోథెరపీ సదస్సును ఎంఎల్ఎ జక్కంపూడి రాజా శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే కాన్ఫరెన్స్‌లో ఫిజియోథెరపీ విద్యార్థులకు నూతన బోధన విధానాల గురించి వివరిస్తారు. దీనిలో హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ సిండికేట్ మెంబర్ డాక్టర్ ఇఫ్తికార్ ఆలీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.మాధవి, ఇండియన్ ఫిజియోథెరపిస్ట్స్ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ కె.రుషివర్షిణి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.సురేష్ బాబు రెడ్డి పాల్గొన్నారు.

## 'ఊపిరి ఉన్నంత కాలం జగన్ వెంటే'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తన ఊపిరి ఉన్నంత కాలం సిఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా, వైసిపికి సేవ చేస్తానని పార్టీ యువజన విభాగం ఉమ్మడి గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి జక్కంపూడి గణేష్ ప్రకటించారు స్థానిక వివి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో గణేష్ మాట్లాడారు. నాడు తన తండ్రి, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డికి ఏకలవ్య శిష్యునిగా పని చేశారని గుర్తు చేశారు. తన తండ్రి మరణించే ముందు తనకు నాయకుడు రాజశేఖర్ రెడ్డి అయితే మీకు నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని చెప్పారని, ఆ మాటకు కట్టుబడి జగనన్నకు అండగా నిలబడి పని చేస్తున్నామన్నారు. జగన్ మోహన్ రెడ్డి తనపై ఏ నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించారో ఆ బాధ్యను 100 శాతం నెరవేర్చే విధంగా పని చేస్తానన్నారు. ఏప్రిల్ 3,4,5 తేదీల్లో 'జయహో జగనన్న' పేరిట యువ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఈ సమ్మేళనానికి పెద్దఎత్తున యువతను సమీకరిస్తామని వెల్లడించారు. నీలి వీర ఆనంద్‌కుమార్, చందన నాగేశ్వర్, దాడిశెట్టి శ్రీనివాస్, పినిపే శ్రీకాంత్, మిండకుదటి శిరీష్, తోట పథ్వీరాజు, పిల్లి సూర్య ప్రకాష్, చిట్టూరి ప్రవీణ్ చౌదరి, చీకట్ల కిశోర్, కొట్టు విశాల్, నల్లా అజయ్, ఇన్నమూరి దీపు తదితరులు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




ఇప్పుడు పూచీ నాది అంటారు..
ఆనక పూచిక పుల్లలా తీసేస్తారు..!!

విజేతలైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

## విజెఎస్‌లో ఇంట్రా కాలేజ్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక దివాన్ చెరువులోని విజెఎస్ కళశాలలో వారం రోజులుగా ఇంట్రా కళాశాల స్పోర్ట్స్ మీట్-2023లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర ఎన్‌వివి.జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసికోల్లాసం పెంపొందించేందుకు ఈ ఆటల పోటీలు ఎంతగాలో దోహద పడతాయన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలను ఆయన అభినందించారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర మాట్లాడుతూ తమ విద్యార్థులను క్రీడా రంగంలో కూడా ప్రోత్సహించేందుకు ఇంట్రా కళాశాల ఆటల పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. కళాశాల చైర్‌పర్సన్ ఎన్.శకుంతల విద్యార్థులను అభినందించారు.

## నేరాలు ఘోరాలు

### ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

**ప్రజాశక్తి - కాజులూరు**

మండలంలోని కోలంక గ్రామంలో యువకుడు మోటూరి వీరబాబు (25) మద్యానికి బానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గొల్ల పాలెం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మోటూరి వీరబాబు తాపీ పని కి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో వివాహం కాలేదని మనస్తాపంతో ఉరి వేసుకున్నా కుటుంబసభ్యులు స్థానికులు గమనించి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని వారు తెలిపారు. ఈ కేసును ఎస్ఐ తులసి రామ్ చేస్తున్నారు.

### బైక్, స్కూటీ ఢీకొని ఒకరి మృతి

**ప్రజాశక్తి - జగ్గంపేట**

జాతరకు వెళుతూ బైక్, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం రాత్రి జగ్గంపేట మండల పరిధిలోని మల్లిశాల గ్రామం అడవిలో జరుగుతున్న సింగరమ్మ జాతరకు మోటార్ బైక్ పై వెళ్తూ వెదురుగా వస్తున్న స్కూటీని ఢీకొనడంతో కిర్లంపూడి మండలం గద్దనపల్లి కి చెందిన సోమనాథ్ ఉమా మహేష్ (21) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడైన పారంశెట్టి గంగా తేజేశ్వరరావు అలియాస్ తేజ ఇద్దరూ కలిసి రాత్రి సుమారు 11గంటల సమయంలో మోటార్ సైకిల్ వెళుతుండగా ఎదురుగా స్కూటీపై వస్తున్న మల్లిసాల గ్రామస్తులు పాలిపిరెడ్డి పూర్ణగంగ, వెనుక కూర్చున్న విజ్జు గంగాధర్ ఢీకొనడంతో నలుగురు కింద పడిపోయారు. మహేష్ తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న తేజకు, స్కూటీపై వున్న పూర్ణగంగ, వెనుక కూర్చున గంగాధర్‌లకు గాయాలు కాగా స్థానిక సాయి ఆర్థోపెడిక్‌లో చికిత్సపొందు తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి

### మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

**ప్రజాశక్తి-మండపేట**

ఇటీవల రాయవరం మండలంలోని మాచవరం శివారు రివర్‌వే సమీపంలో జరిగిన మహిళా హత్య కేసులో నిందితులు పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాయవరం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ బాలచంద్రారెడ్డి ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 23న గద్దెవాలులో ఒక మహిళ హత్యచేయబడిన గుర్తించారు. స్థానిక రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. మాచవరం గ్రామానికి చెందిన ద్వారపూడి గంగరాజు కుమార్తె కొప్పుల సత్యవేణి ఫిబ్రవరి 23న నుంచి కనిపించలేదన్న విషయం వారి దృష్టికి వచ్చింది. దీనిపై ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన నల్లమిల్లి ఉమామహేశ్వర రెడ్డి, అతని తమ్ముడు వెంకట సత్యనారాయణ రెడ్డి సంఘటన జరిగిన రోజు నుంచి కనిపించలేదు. గత రెండేళ్ల క్రితం వితంతువైన సత్యవేణి వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పెద్దలు పిలిచి మందలించారు. ఈ విషయం తెలిసిన ఆమె సోదరుడు హత్య చేశారని గ్రామంలో పలువురు చెప్పుకున్నారు. నిందితులు హత్య చేశారని గ్రామంలో పలువురు చెప్పుకోవడంతో నిందితులు తల్లి ఉదయం పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె చనిపోయిన వార్తను దినపత్రికలో చూసిన వారు ఎస్సైకి లొంగిపోయారు. శుక్రవారం పోలీసులకు దొరికారు. అనంతరం వారిని విచారించగా తమను గ్రామ పెద్దలు మందలించడంతో సత్యవాణిపై కోపం పెంచుకున్నామన్నారు. ఫిబ్రవరి 23న అర్ధరాత్రి సత్యవేణిపై అత్యాచారం చేసి, గొంతు నులిమి చంపేశామన్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు. ఈ సమావేశంలో మండపేట రూరల్ సిఐ శివగణేష్, ఎస్ఐ సురేష్, కానిస్టేబుళ్లు ఏసు కుమార్, సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-ఆత్రేయపురం**

పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ర్యాలీ గ్రామానికి చెందిన మెర్ల కొండయ్య మూడేళ్ల క్రితం తన తల్లి మందలించిందని పురుగుల మందు తాగాడు. అప్పటినుంచి కాళ్లు చేతులు సరిగా పనిచేయక బాధపడుతూ ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఇటీవల కాలంలో తన తల్లికి భారంగా ఉంటున్నట్టు భావించి చనిపోవాలని ఉద్దేశంతో ఈనెల 8న పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని తల్లి కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు.

### మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - సీతానగరం**

నల్లగొండ గ్రామానికి చెందిన బండిలి వీర్రాజు (30) మద్యానికి బానిసై బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలివి. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని భార్యను కోరగా ఆమె నిరాకరించింది. మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. ఈ విషయం వీర్రాజు తమ్ముడు సుబ్రహ్మణ్యంకి తెలిసి వెంటనే అతన్ని ప్రథమ చికిత్స నిమిత్తం సీతానగరం పిహెచ్‌సికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కొరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడని వీర్రాజు తమ్ముడు సుబ్రహ్మణ్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేశారు.

## యానాం వార్తలు

### సర్కార్ ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

- పుదుచ్చేరి అసెంబ్లీలో కేంద్రానికి కృతజ్ఞతలు
- స్పీకర్ సెల్వంకు ఎంఎల్ఎ అశోక్ సత్కారం

**ప్రజాశక్తి - యానాం**

కాకినాడ నుంచి చెంగల్ పట్టు వరకు నడిచే సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలును పుదుచ్చేరి వరకు పొడిగించేలా నిర్ణయం తీసుకున్నందుకు శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ ఆర్ సెల్వం, ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల యానాం ప్రజల కల నెరవేర్చినందుకు ఆ దిశగా తనతో పాటు విశేష కృషిచేసిన ఎల్జి తమిళిసై సౌందరరాజన్, స్పీకర్ సెల్వం, రాజ్యసభసభ్యుడు సెల్వగణపతి, బిజెపి జనరల్ సెక్రటరీ బిఎల్ సంతోష్‌లతో పాటు నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు యానాం ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గత కొన్నేళ్లుగా ఢిల్లీ వెళ్లినప్పుడల్లా సర్కార్ ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరివరకు పొడిగించాలని అనేక సార్లు స్పీకర్ సెల్వం, రాజ్యసభసభ్యుడు సెల్వగణపతితో కలిసి రైల్వేమంత్రిత్వశాఖకు అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించినట్టు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. సర్కార్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపుకు కృషిచేసిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



స్పీకర్ సెల్వంను సత్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

**స్పీకర్ సెల్వంకు ఎంఎల్ఎ అశోక్ సత్కారం**

సర్కార్ పొడిగింపులో కషిచేసిన స్పీకర్ ఆర్ సెల్వం ను పుదుచ్చేరి అసెంబ్లీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఘనంగా సత్కరించారు. అనంతరం స్పీకర్ సెల్వం మాట్లాడుతూ సర్కార్ పొడిగింపుకు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పట్టువదలకుండా చేసిన విశేషకృషి ఫలితమే ఈ విజయమని ప్రశంసల వర్షం కురిపించారు.

### మున్సిపల్ ఉద్యోగుల జీతాలు విడుదల

యానాం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రస్తుత ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల బకాయి జీతాల కోసం రూ.3 కోట్ల 53లక్షల 50 వేలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 -23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుండి జనవరి వరకు మొత్తం నిధులు మంజూరైనట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ద్వారా నిర్ణీత సమయంలో బిల్లులు సిద్ధం చేసి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీస్‌కు పంపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తమ 10 నెలల జీతాలను విడుదల చేయించినందుకుగాను మున్సిపాలిటీ ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

దరియాలతిప్పలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

### అభివృద్ధి పనుల పరిశీలన

యానాం పరిధిలో పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆర్ఎఓ ముని స్వామి సంబంధిత అధికారు లతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు స్థానిక దరియా లతిప్ప గ్రామంలో వాటర్ ట్యాంకులను,మంచినీటి చెరువుల్లో పూడికతీత పను లను ఆయన పరిశీలించారు. అనంతరం యూకేవి నగర్ కి సంబంధించి విద్యుత్ స్తంభాలు శిథిలావస్థ స్థితిలో ఉండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులతో కలిసి నూతన విద్యుత్ స్తంభాలు అమర్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కాళ్ల నాగరాజు,ముగ్గళ్ళ మూర్తి,లంక కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### విష జ్వరాల నియంత్రణకు చర్యలు

**ప్రజాశక్తి-కొత్తపేట**

గ్రామాల్లో వైరల్ ఫీవర్ ఎక్కువమంది బారిన పడుతున్నారని ముందుగా హెల్త్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలు ఉంటే దష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే వైద్యఆరోగ్య శాఖ, ఎయన్‌యమ్ ఆశ వర్కర్స్‌తో గ్రామంలో వైరల్ ఫీవర్ మీద సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలన్నారుర. అలాగే వైయస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 సంవత్సరాలు నిండిన అవ్వాతాతలకు ఉచిత కళ్లద్దాలు అందజేసేందుకు వివరాలు నమోదుచేయాలన్నారు. గ్రామం పంచాయతీ పరిధి శానిటేషన్ తరచుగా చేయాలని సిబ్బందికి సూచించారు. అవగాహన సదస్సు లో పంచాయతీ సెక్రటరీ సిహెచ్.శాంతి, సూపర్ వైజ్ రాజబాబు, హెల్త్ అసిస్టెంట్లు కె.మాచార రావు, జి. .రమణ, కమ్యూనిటి హెల్త్ ఆఫీసరు పాల్గొన్నారు

### నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్ల రద్దుకు డిమాండ్

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్లురద్దు చేయాలని రాష్ట్ర నాయకులు మానుపాటి నవీన్, కుడమల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో చాలా ప్రదేశాల్లో నకిలీ గిరిజన కుల సర్టిఫికెట్లతో గిరిజనేతరులు లబ్ధి పొందుతున్నారని అలాంటి సర్టిఫికెట్లను రద్దుచేసి గిరిజనులకు న్యాయం చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్, ఆంధ్రప్రదేశ్ యానాదులు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడమల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. కోనసీమ అంబేద్కర్ జిల్లారామచంద్రాపురం ఎస్‌టి కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామచంద్రాపురంలో కొందరు గిరిజనేతరులు గిరిజన కుల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భారీ ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతి పత్రం అంద చేశారు. కార్యక్రమంలో జైభీమ్ సైనిక్ వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ రాజు, అయిదవ వార్డ్ కౌన్సిలర్ అమలదసు లోవరా, జిల్లా అధ్యక్షులు గంధం బంగారుబాబు, మర్రి గణపతి గొర్రెల గణపతి వానపాటి రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఆటల పోటీలు

**ప్రజాశక్తి-అమలాపురం**

కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్దేశించబడిన వివిధ క్రీడల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎ.వేమవరం బాలికల చే ర్యాలీ ఆ తర్వాత వారికి కబడ్డీ, బాస్కెట్‌బాల్, షూటింగ్, రిక్రియేషన్ గేమ్స్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్, ప్రధాన ఉపాధ్యాయులు ఎంవి.సుబ్బారావు, బాస్కెట్‌బాల్ శిక్షకులు భీమేష్, వ్యాయామ దర్శకులు ఉమామహేశ్వరరావు, రెజ్లింగ్ శిక్షకురాలు కనకదుర్గ, టైక్వాండో శిక్షకులు సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది కామేష్ పాల్గొన్నారు.

### వినియోగదారులకు రక్షణగా చట్టాలు

**ప్రజాశక్తి-కాకినాడరూరల్**

వినియోగదారులకు ఉన్న హక్కులను నిర్దేశించి వారికి రక్షణ కల్పించే ఉద్దేశంతో చట్టాలను రూపొందించారని వినియోగదారుల రక్షణ కమిషన్ సభ్యురాలు చక్కా సుశీ పేర్కొన్నారు. రమణయ్యపేటలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొన్న వస్తువు నాణ్యత లేకపోయినా లేదా ఒప్పందం ప్రకారం అసంపూర్తి సేవ చేసినా వినియోగదారుల కింద భావించి నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ తగు ఆధారాలతో వినియోగదారుల ఫోరం కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదును తెలుగులో కూడా చేయవచ్చుని న్యాయవాది అవసరం కూడా లేదన్నారు. చెల్లించిన ధర, తయారీదారుని పేరు, చిరునామా తదితర వివరాలను ఫిర్యాదులో పేర్కొనాలని అన్నారు. బిల్లులు, రసీదులు తప్పనిసరిగా జతపరచాలని సుశీ తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌ను కలిసిన సూర్యనారాయణరాజు

### సిఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

**ప్రజాశక్తి- తాళ్లరేవు**

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తాళ్ళరేవు మండలానికి చెందిన వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్, వైసిపి నాయకులు పెట్ల సూర్యనారాయణరాజు అన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థుల ఎంపికలో భాగంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎంఎల్‌సి అభ్యర్థిగా అవకాశం కల్పించిన సిఎం జగన్మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారని సిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి స్థానాలకు వైసీపీకి చెందిన ఏడుగురు అభ్యర్థులతో పాటు ఇజ్రాయిల్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా శాసన మండలి జాయింట్ సెక్రెటరీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డికి ఇజ్రాయిల్ నామినేష న్ దాఖలు చేశారని, ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారితో పాటు తనకు పాల్గొనే అవకాశం కలిగిందని పెట్ల సూర్య నారాయణ రాజు ఆనందం వ్యక్తం చేశారు.

జాతర ఏర్పాట్లు ప్రారంభిస్తున్న ఆలయ ఇఒ, చైర్మన్, స్థానిక నాయకులు

### నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

**ప్రజాశక్తి - పెద్దాపురం**

పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఈనెల 20వ తేదీన ప్రారంభమై 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పనులు ప్రారంభించినట్లు ఆలయ ఇఒ తలాటం వెంకట సూర్యనారాయణ, దేవస్థానం చైర్మన్ గవరసాన వీరస్వామి (బాబ్జి )లు తెలిపారు. ఈ జాతర ఏర్పాట్లు కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు,సొసైటీ చైర్మన్ పళ్ళ గంగారావు,ఉప సర్పంచ్ జోకా నానాజీ,గవరసాన రాజశేఖర్ పాల్గొన్నారు.

### త్వరితగతిన వ్యవసాయ క్షేత్ర గుర్తింపు

**ప్రజాశక్తి - కాజులూరు**

కోలంక గ్రామంలో జరుగుతున్న వ్యవసాయ క్షేత్ర గుర్తింపు ప్రక్రియను శుక్రవారం తహశీల్దార్ బి.సాయి సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 20 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి డ్రోన్ మ్యాపులు గ్రామాలకు చేరాయని వీటిలో 9 గ్రామాలకు సంబంధించి పూర్తి కాగా మరో పది గ్రామాల్లో వివిధ దశలో ఉన్నాయన్నారు. కోలంకకు సంబంధించి డ్రోన్ ప్రక్రియకు సంబంధించి మ్యాపులు రాకపోవడంతో సచివాలయ సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో గుర్తింపు జరుగుతోందన్నారు. ఆయనవెంట విఆర్‌ఒలు దేగల సుబ్రహ్మణ్యం, సుధాకర్, సచివాల సర్వేయర్ సంధ్య, సిబ్బంది వాసంశెట్టి సుబ్బారావు, రవికుమార్, తోగరు చంద్రశేఖర్, రైతులు ఉన్నారు. .

## బాధ్యతాయుత యువతగా తయారవ్వాలి

**- ఆదిత్య విద్యార్థులతో డాక్టర్ జయప్రకాష్ నారాయణ ముఖాముఖి**

**ప్రజాశక్తి - గండేపల్లి**

విద్యార్థులు బాధ్యతాయుత యువతగా తయారవ్వాలని డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వల్పకాలిక ప్రయోజనాలకు, అవసరాలకు ప్రలోభాలకు లోను కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు వేసి భావిత రాలకు బంగారు బాట వేసే విధంగా యువత ఆలోచనలు ఉండాలని సూచించారు. అత్యధిక యువశక్తి ఉన్న మన భారతదేశం అభివృద్ధి చెందకుండా ఉండటానికి కారణం మనలో ప్రాంతాల, భాషల, కులాల మతాలు, పార్టీల పరంగా వ్యత్యాసాలు ఉండటమే అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి మానవుడు ఎన్నో విషయాలు నేర్చుకుంటూ సముపా ర్జించిన జ్ఞానాన్ని ఇతరులకు అందించే సహజ సిద్ధమైన స్వభావం వలన ఇతరులను ప్రభావితం చేయవచ్చు అని తెలిపారు. విద్య వలన మానవునిలో తత్వ విచారణ పెంపొందుతుందని, మంచి విద్య సముపార్జించిన ఏ వ్యక్తి ఐన ఇతరుల మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించే స్వభావాన్ని కలిగి ఉంటారని తెలిపారు. విజ్ఞాన సముపార్జన యొక్క ప్రాథమిక లక్ష్యం విషయాలు తెలుసుకొనుట, తెలుసుకున్న విషయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో ఉత్పన్నమయ్యే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపుతూ భావితరాలకు ఆదర్శంగా నిలవచ్చున్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇస్తూ సాగిన కార్యక్రమం విజ్ఞానదాయకంగా సాగింది. అనంతరం డాక్టర్ జయప్రకాష్ నారాయణను ఆదిత్య యాజ మాన్యం తరపున, జ్ఞాపిక దుశ్శాలువతో ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు వై.డి.రామారావు, ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, డైరెక్టర్. నల్లమిల్లి శృతి రెడ్డి, ప్రిన్సిపాల్‌లు ఎం.శ్రీనివాసరెడ్డి, డోలా సుబ్ర హ్మణ్యం, ఆదిరెడ్డి రమేష్, సంజయ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జయప్రకాష్‌నారాయణను సత్కరిస్తున్న ఆదిత్య శేషారెడ్డి, ప్రిన్సిపాల్‌లు

## 13న కాకినాడలో వికాస జాబ్ మేళా

**ప్రజాశక్తి - కాకినాడ**

వికాస కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ సోమవారం జాబ్ మేళా నిర్వహి స్తున్నట్టు వికాస పీడీ కె. లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో డ్రీమ్ వే సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఫ్రంట్ ఆఫీస్, వెబ్ డెవలపర్, మొబైల్ యాప్ డెవలపర్, డిజైనర్, యానిమేటర్, నిట్ (ఐసిఐసిఐ బ్యాంక్లో రిలేషన్స్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్, డెక్కన్ కెమికల్స్ ట్రైనీ, ఇండిగో ఎయిర్లైన్స్లో లోడర్స్, డ్రైవర్స్, వీల్స్ మార్ట్ ఆటో ఫైనాన్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలి కాలర్, మెకానిక్ హెల్పర్, గవర్నమెంట్ ప్రాజెక్ట్స్ కాలింగ్ ఏజంట్స్, ఐనాక్స్ ఆపరేషన్ అసోసియేట్స్, అమెజాన్లో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవల ప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ఈఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుండి రూ.35 వేల వరకు జీతం తో పాటు ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను అట్టి ఉంటుందన్నారు. www.vikasajobs.comలో సంప్రదించవచ్చని పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13న సోమవారం కాకినాడ కలెక్టోరేట్ వద్ద వికాసకార్యాలయంలో ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి కాకినాడరూరల్**

శీతాకాలం నుండి వేసవిలోకి ప్రవేశించడంతో వైరస్ వ్యాధులు సహజమని తగు జాగ్రత్తలతో దీనిని అధిగమించవచ్చని పండూరు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఆయేషా ఫాతిమా వివరించారు. రమణయ్యపేటలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వైరస్ వలన జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులు ఉంటాయన్నారు. రెండు మూడు రోజులకే జ్వరం తగ్గినా జలుబు, దగ్గు మరి కొన్ని రోజులు వేధిస్తాయని అన్నారు. వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటీబయాటిక్స్ వాడాలని అన్నారు. పారాసెటమాల్ వాడడంతో పాటు ఆవిరి పట్టాలని అన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఫాతిమా తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-కాకినాడరూరల్**

స్థానిక పీ.వెంకటాపురం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2023-24 సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి. సుశీల శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఐదవ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు, ఉన్నాయన్నారు. బోధన ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుకలు, అమ్మఒడి తదితర సదుపాయాలు అందిస్తామని, జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్ ) నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజన సదుపాయాలు ఉంటాయన్నారు. ఇంటర్మీడియట్ బాలికలకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తారు. క్రీడలు, సహపాఠ్య అంశములు ఉంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హతలు గల బాలికలు .ఈనెల 23 తేదీ లోగా ఆన్ లైన్ వెబ్సైట్ https://apgpcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోగలరు. జిల్లాలోని ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశపరీక్షను ది ఏప్రియల్ 23న ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం 2గం ఇంటర్మీడియెట్ అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరములకు పాఠశాల పనివేళలలో సంప్రదించవచ్చన్నారు. విద్యార్థి ఫోటో, ఆధార్ కార్డ్‌తో నేరుగా సంప్రదిస్తే ఉచితంగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేస్తామని తెలిపారు.

### పలువురికి కంటి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -అమలాపురం రూరల్**

రాష్ట్ర ప్రభుత్వం వారిచే అవ్వా, తాత కంటి వెలుగు కార్యక్రమాన్ని డాక్టర్ మహమ్మద్ హసన్ కంటి వైద్య నిపుణులచే శుక్రవారం వన్నె చింతలపూడి క్షత్రియ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నక్కా రాజరత్న నాగవాణి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని కంటి వెలుగు ను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు చేసి 60 సంవత్సరాలు పైబడిన వారికి ఉచిత కంటి ఆపరేషన్ కళ్ళద్దాలు అందజేశామన్నారు. అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నడింపల్లి వెంకటరామరాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు, ఇతరులకు కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి సహకారం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా అందజేస్తామన్నారు. వైద్య శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, ఎఎన్ఎమ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

### బైకుల దొంగ అరెస్టు

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం**

బైక్‌లు చోరీ చేసిన నిందితున్ని టుటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. విలేకరుల సమావేశంలో టు టౌన్ సిఐ గణేష్ మాట్లాడుతూ కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన మన్యం వెంకట హరికృష్ణ నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుబ్బరాయమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. టు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 5, త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో 1, దేవరపల్లి పోలీసు స్టేషన్‌లో 1 చొప్పున వాహనాల మిస్సింగ్ కేసులు ఉన్నాయని వివరించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకోవటంలో చాకచక్యముగా వ్యవహరించి ఎస్‌ఐలు జివివి.సత్యనారాయణ, కెఎం.జోషి, హెడ్ కానిస్టేబుల్‌లు శ్రీనివాసరావు, రాజశేఖర్, కానిస్టేబుల్‌లు కె.ప్రదీప్‌కుమార్ వీరబాబు, కరీంలను ఈ సదర్భంగా అభినందించారు.

**In The Court Of The 4th Additional District and Sessions Judge Kakinada (MACT)**
**M.V.O.P.No. 160/2021**

*Between:*
Chekka Tatabbai ...*Petitioner*
AND
Bodireddy Srinu and Others ...*Respondents*

*TO: 2nd Respondent:*
Sri Satya Enterprises, Prop. Akula Ravi Krishna, R/o. D.No. 70-7-60/3D, G5, Ravichandra Enclaves, Thota Subbarao Nagar, Kakinada, E.G.Dist. (Owner of Tipper Lorry AP 05 TM 2736)

పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.31-03-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీకు పరోక్షమున తీర్మానించబడును.

**DANDUPROLU NAGABABU**
Advocate, Kakinada.
Cell: 98484 22089

**In the Court of the 1st Addl. District Judge (MACT), E.G.Dt., Rajamahendravaram**
**M.V.O.P. No. 111/2021**

*Between:*
చోడి గోవిందు దొరా -పిటీషనర్
మరియు
వి.రాజా శేఖర్ మరియు అదర్స్ -రెస్పాండెంట్స్

*2వ రెస్పాండెంట్:*
అన్నిక కృష్ణారావు, S/o. గంగరాజు, హిందువు, వయస్సు 40 సం||లు, ఓనర్ ఆఫ్ ఆటో నెంబరు: AP 39 V 6560, R/o. D.No. 4-56, గిన్నెపల్లి, రంపచోడవరం (M), E.G.Dist., -రెస్పాండెంట్

పై నెంబరు ఒ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక తప్పుదారి పట్టిస్తూ కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు రెస్పాండెంట్ వాయిదా రోజు అనగా **13-03-2023వ తేదీన ఉదయం 10.30 గం||లకు** హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

రాజమండ్రి **జి.శ్రీనివాస్**
10-3-2023 అడ్వకేట్, రాజమండ్రి

**In The Court Of The Deputy Registrar Of Chits / Arbitrator : Kakinada**
**Present: Smt. P.RamaLakshmi Patnaik**
**(Application for reference of a dispute to arbitrator)**
**A.A.C.F.No. 82/2022**

*Between:*
Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt Ltd, Kakinada Branch, Rep. by its Foreman /Branch Manager Mr.Pepakayala Veera Venkata Satyanarayana, S/o. Suribabu. ...*Disputant*
AND
Vendra Durga Prasad and Others ...*Opponents*

*Opponent No-1:* Vendra Durga Prasad, S/o. V.Srinivas, Hindu, Aged 40 Years, Civil Contractor, Rajahmundry, R/o. D.No. 69-2-10/1, Saloom Church Street, Bhaskar Nagar, Rajahmundry.

*Opponent No-2:* Veeravalli Suseela Franklin, W/o. B.Venkata Ramana, Hindu, Aged 56 Years, multipurpose Health Assistant (Female), Employee Code: 0359238, Primary Health Centre, Rajanagaram, Rajanagaram Mandal, R/o. D.No. 24-4-8/1, Weavers Colony, Rajahmundry.

*Opponent No-3:* Gubbala Naga Malleswararao, S/o. Satyanarayana, Hindu, Aged 35 Years, Contract Works and Realestate Business, Rajahmundry, R/o. D.No. 4-339/7, Swaroop Nagar, Diwancheruvu, Rajahmundry.

*Opponent No-4:* Chebrolu Nanaji, S/o. Nageswararao, Hindu, Aged 42 Years, Contract Works, Rajahmundry, R/o. D.No. 82-14-26, 3rd Street, Barma Colony, Rajahmundry Urban.

*Opponent No-5:* Vendra Latha, W/o. V.Durga Prasad, Hindu, Aged 33 Years, Tailaring Works, Rajahmundry, R/o. D.No. 69-2-10/1, Saloom Church Street, Bhaskar Nagar, Rajahmundry.

డిస్‌ప్యూటెంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ మొత్తము **రూ.2,29,972/-** రాబట్టు కొనుటకు గాను మీపై దాఖలు చేసిన పై డిస్‌ప్యూట్‌లో 1 నుండి 5వ అపోనెంట్స్ అయిన మీకు పైన తెలిపిన ఆఫీసు వారు పోస్టు ద్వారా పంపిన నోటీసులు మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పైన తెలిపిన ఆఫీసు వారి ఆదేశాల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వడం జరిగినది. కావున మీరు **ది. 21-03-2023వ తేదీన ఉదయం గం||11:00 ని||లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవలెను.** లేని ఎడల పరోక్షమందు తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**By Order Of Deputy Registrar Of Chits /Arbitrator, Kakinada**

**దస్తావేజులు పోయినవి**

పిచ్చికల వేణుగోపాల్, తండ్రి: హరేరామ్, నల్లజర్ల, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా గ్రామ కాపురస్తుడు అయిన నాకు ది. 20-02-2015 సం||రం తేదీ దస్తావేజు నెం.556/2015రుగా నల్లజర్ల గ్రామం తాలూకా సర్వే నెం.1049/2, 1-95 సెంట్లు, 1041/2, 12 సెంట్లు, 737/1సి, 1-95 సెంట్లు, 737/2ఏ, 1-00 సెంట్లు, 738/1, 0-64 సెంట్లు, 738/2, 0-53 సెంట్లు నెంబర్లు గల దస్తావేజులు కలవు. ది.25-10-2020వ తేదీన కొన్ని కారణాల రిత్యా నేను ఇల్లు మారుతుండగా ఆ దస్తావేజులు ఎక్కడో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకి తెలియ జేయగలరని తెలియజేసూ..,

**పిచ్చికల వేణు గోపాల్**
**నల్లజర్ల, నల్లజర్ల మండలం, తూ||గో||జిల్లా.**
**సెల్: 98666 64699**

**చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్**
(A Government undertaking sponsored by Union Bank of India)
డో.నెం. 6-418, అరవింద్ నగర్, మోరంపూడి, రాజమండ్రి రూరల్, తూ||గో||జిల్లా

**మోరంపూడి శాఖ - బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా శాఖలో తీసుకున్న ఋణములు ఎన్ని విధములుగా మీకు సమాచారం పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణం చెల్లించవలసిన కాలం గడిచినందున ప్రధాన కార్యాలయం వారి ఉత్తర్వుల మేరకు సదరు బంగారు నగలను **ది. 27-03-2023 సోమవారం మ|| గం|| 3.00లకు** ఈ మోరంపూడి శాఖ ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరునున్న బకాయిలు జమ కట్టుకొనుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొనదలచినవారు ది. 27-03-2023 మ|| గం|| 1.00 లోపు రూ. 5,000/- అడ్వాన్సుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలమును రద్దు చేయుట గాని, వాయిదా వేయుట గాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. వేలం వేసిన బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. మరియు వేలం తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈదిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం వర్తిస్తుంది. నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరిగా తెలియజేయడమైనది.

**మోరంపూడి శాఖ, తూర్పుగోదావరి జిల్లా, వేలం తేది: 27-03-2023 సమయం గం|| 3.00లకు**

| క్ర.సం. | అప్పు ఖాతా నెం. | ఋణగ్రహీత పేరు, చిరునామా | నికర తూకం గ్రా|| |
|---|---|---|---|
| 1. | 718030100021286 | కుసుమ మల్లిఖార్జున్ | 38.000 |
| 2 | 718030100036312 | పిల్లి అంజలికుమారి దేవి | 23.000 |

మోరంపూడి
10-03-2023
**బ్రాంచి మేనేజర్**
**చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, మోరంపూడి, సెల్: 9100903271**